ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 26 నవంబరు 2024



హత్యకేసు నిందితుడిని పట్టించిన పెండ్లికార్డు

26 ఏళ్ల క్రితం పసిబిడ్డను హతమార్చి పరారైన తండ్రి
పేరు మార్చుకుని కర్ణాటకలో జీవనం
రెండో భార్య కూతురి పెండ్లిపత్రిక ఆధారంగా అరెస్టు
7



రీచార్జ్ చేస్తేనే కరెంటు

విద్యుత్ కనెక్షన్లకు కొత్త స్మార్ట్‌మీటర్లు
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు
మొదటి విడతలో 2.93 లక్షల మీటర్ల బిగింపు
మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్
6



పైసలిస్తేనే... పత్రం..!



సచివాలయంలో తనిఖీ చేసిన తహసీల్దార్ సువర్ణ

- అంగట్లో బర్త్ సర్టిఫికెట్లు
- బత్తలపల్లి సచివాలయంలో దందా
- రూ.వెయ్యి నుంచి రూ.5వేలు వసూలు
- ప్రైవేటు వ్యక్తి ద్వారా తంతు
- పట్టించుకోని అధికారులు
- డబ్బు ఇవ్వనివారు ప్రదక్షిణ చేయాల్సిందే..

బత్తలపల్లి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఒకటో సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రాలను అంగట్లో సరుకులా రేటు కట్టి మరీ.. విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైసలిస్తే.. వెంటనే జారీ చేస్తున్నారనీ, లేదంటే ప్రదక్షిణ చేయాల్సిందేనని బాధితులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అందించాల్సిన జనన ధ్రువీకరణ పత్రాలను ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా ఇస్తున్నట్లు విమర్శలున్నాయి. ఒక్కో సర్టిఫికెట్ జారీకి రూ.వెయ్యి నుంచి రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి ప్రసవాలకు ఉమ్మడి జిల్లాలోని అన్నిప్రాంతాల నుంచి అధికంగా వస్తుంటారు. ఆస్పత్రిలో ప్రసవమైన వారికి బత్తలపల్లి సచివాలయంలో జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అపార్ నమోదుకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. దీంతో తమ పిల్లల జనన ధృవీకరణ పత్రం తీసుకోనివారు రోజూ వందల సంఖ్యలో సచివాలయానికి వస్తున్నారు. దరఖాస్తు చేసుకుంటున్నారు. దీనినే సచివాలయంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఆమ్యామ్యాలు ముట్టజెప్పిన వారికి వెంటనే జనన ధ్రువీకరణ పత్రం ఇస్తారు. డబ్బు ఇవ్వని వారిని రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

ఐదుసార్లు తిరిగినా పత్రం ఇవ్వలేదు: రుక్సానా, తాడిపత్రి



నా కుమారుడు ఆర్డీటీ ఆస్పత్రిలో జన్మించాడు. బర్త్ సర్టిఫికెట్ కోసం ఐదుసార్లు తిరిగినా ఇవ్వలేదు. ఎప్పుడొచ్చినా తర్వాత రమ్మని చెప్పి పంపుతున్నారు. ప్రతిసారీ రూ.500 ఖర్చవుతోం ది. సచివాలయంలో ఆమ్యామ్యాలు ముట్టజెబితే వెంటనే సర్టిఫికెట్ ఇస్తున్నారు.

డబ్బు ఇవ్వకుంటే బయటకు పంపుతున్నారు: రమీజా, ముదిగుబ్బ



నాకుమారుడి బర్త్ సర్టిఫికెట్ కోసం 6సార్లు తిరిగా. ప్రతిసారీ వెనక్కి పంపుతున్నారు. డబ్బు ఇచ్చే వారిని కార్యాలయంలోకి పిలుచుకుని, మరీ పత్రం అందజేస్తున్నారు. ఇవ్వని వారిని బయటకు పంపుతున్నారు.

డబ్బులిస్తే.. వెంటనే..

జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఉమ్మడి జిల్లానే కాక రాయలసీమలోని పలుప్రంతాల నుంచి బత్తలపల్లి సచివాలయానికి భారీగా వస్తున్నారు. అదేరోజు జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే రూ.5వేలు ఇచ్చుకోవాలన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇందులో కొంతమంది దళారులు సైతం రంగంలోకి దిగి ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. డబ్బు ఇచ్చుకోలేని వారు సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిందే. రెక్కాడితేగానీ డొక్కాడని వారు పనులు మానుకుని, వ్యయప్రయాసలకోర్చి తిరుగుతున్నారు. అయినా తమ గోడు పటించుకునేవారు కరువయ్యారని వారు మండిపడుతున్నారు. ఉదయం వచ్చి రోజంతా వేచి చూసినా.. తరువాత వారం రావాలని చెప్పి వెనక్కి పంపుతున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతస్థాయిలో దందా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటి వరకు 2వేలమంది దరఖాస్తులు పెండిగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ దందాలో పంచాయతీ పాలకవర్గంలోని సభ్యుడికి వాటా ముడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారించి, చర్యలు తీసుకుంటాం: నరసింహనాయుడు, ఎంపీడీఓ, బత్తలపల్లి

ప్రైవేటు వ్యక్తి ద్వారా సర్టిఫికెట్లు అందించడం నిబంధనలకు విరుద్ధం. దీనిపై విచారించి, చర్యలు తీసుకుంటాం.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 215 మంది వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. వాటిని కలెక్టర్ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదన్నారు. సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

దివ్యాంగుడి సమస్య పరిష్కారం

కనగానపల్లి మండలం తల్లిమడుగు గ్రామానికి చెందిన సుకన్య, అశోక్ దంపతుల కుమారుడు నీలకంఠేశ్వర్ నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు వచ్చాడు. దీనిని గమనించిన కలెక్టర్ చేతన్ స్వయంగా వారి వద్దకెళ్లి సమస్యను ఆరాతీశారు. దివ్యాంగుడైన తమ కుమారుడి పింఛన్ ఏడాది క్రితం తొలగించారని విన్నవించారు. తక్షణమే పింఛన్ పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించారు.

డీపీఓలో..

పుట్టపర్తిరూరల్(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు 38 ఫిర్యాదులు సమర్పించారు. వాటిని ఎస్పీ రత్న స్వీకరించారు. తక్షణమే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులను చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ జేవీ సురేశ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో డిసెంబరు 2వ తేదీ నుంచి ఆఫీసు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. 10, ఇంటర్, డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల యువతీయువకులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9182288465 నంబరులోగానీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోగానీ సంప్రదించాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో హిందూపురంలోని ఉమానర్మదేశ్వరస్వామి



గోరంట్లలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీకశోభ

హిందూపురం అర్బన్/గోరంట్ల, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస చివరి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలు కార్తీక శోభ సంతరించుకున్నాయి. ఉదయం నుంచే శివుడి మూల విరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు చేసి, సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. హిందూపురం త్యాగరాజనగర్‌లోని ఉమానర్మదేశ్వరస్వామి ఆలయంలో లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని వినాయక్‌నగర్, అదే మండలంలోని బూడిదగడ్డపల్లి శ్రీషిర్డిసాయిబాబా ఆలయాల్లో లక్షదీపోత్సవం కనులపండువగా సాగింది. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై, దీపాలు వెలిగించారు.



ఉమానర్మదేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించిన భక్తులు

మాట నిలబెట్టుకునే ప్రభుత్వం మాది



సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

- మంత్రి సవిత

సోమందేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమందేపల్లిలో ఎన్నడూలేని విధంగా రూ.1.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. స్థానిక సాయినగర్‌లో రూ.13లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను మంత్రి సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఎన్నో సమస్యలను ప్రజలు తన దృష్టికి తెచ్చారన్నారు. వాటన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చానన్నారు. వాటిని దశలవారీగా నెరవేరుస్తున్నామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో అభివృద్ధి ఊసేలేకుండా పోయిందన్నారు. కూటమి అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, నేతలు నీరుగంటి చంద్ర, వెంకటరాముడు, వెంకటేశులు, సిద్దలింగప్ప పాల్గొన్నారు.

తగ్గేదేలే..!





- పురం వైసీపీలో కొనసాగుతున్న పోరు
- ఇన్‌చార్జికి మూడువర్గాలు దూరం
- బలం పెంచుకుంటున్న ఒక నేత
- అధిష్టానం వద్దకు వెళ్లే యోచన

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అధికారం లేకపోయినా వైసీపీలో విభేదాలు మాత్రం సమసిపోలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూపురంలో ఎలా వ్యవహరించారో ప్రస్తుతం కూడా ఆ పార్టీ నాయకులు అలాగే ఉన్నారు. నియోజకవర్గంలో విభేదాల నేపథ్యంలో ఆదివారం హిందూపురానికి పులమతికి చెందిన నేత సతీష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వచ్చారు. పార్టీలోని అన్నివర్గాల అభిప్రాయం తీసుకుని అధిష్టానానికి తెలియజేసేందుకు వచ్చారు. ముఖ్యనేతలు వచ్చినా రెండువర్గాలవారు అందుబాటులో లేకుండా పోయారు. మరోవర్గం వారు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్యాలయం వద్దకు రాకుండా మరోచోట సమావేశమయ్యారు. దీంతో వచ్చిన నేతలు పార్టీ ఇన్‌చార్జి కార్యాలయం వద్ద సమావేశమై అక్కడకు వచ్చిన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకెళ్లారు. మరోచోట నాయకులు, కార్యకర్తలున్నా ఎంతసేపటికీ ముఖ్య నేతలు వెళ్లకపోవడంతో వారు వెళ్లిపోయారు. దీంతో ఒకవర్గం అభిప్రాయాలు మాత్రమే సేకరించి వెళ్లినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పురం వైసీపీలో కుమ్ములాటలు ఇప్పట్లో తగ్గేలా లేవన్న చర్చ సాగుతోంది. ఆదివారం పరిణామాలను బట్టి చూస్తే వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపికకు మూడువర్గాల నాయకులు దూరంగా ఉంటున్నట్లు స్పష్టమవుతోంది.

బలపడుతున్న నేత

నియోజకవర్గంలోని ఓ నేత వద్దకు నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా మొన్నటి వరకు నిలువరించారు. దీపికకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన తరువాత సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఇతర ముఖ్య నాయకులు కూడా ఆ నేత వద్దకు వెళ్లడానికి జంకారు. ఇన్‌చార్జికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులు పుష్కలంగా ఉండడమే ఇందుకు కారణం. దీంతో హిందూపురం వైసీపీలో ఒక్కరే నాయకుడు అనేలా ఎన్నికల ముందువరకు వ్యవహరించారు. ఎన్నికల సమయంలో విభేదాలు బయటపడ్డాయి. అప్పటివరకు అందరూ కలిసి ఒకే నాయకత్వమని చెప్పుకొచ్చారు. ఎన్నికల అనంతరం వర్గాలు బయటపడ్డాయి. అవి సమసిపోలేదని స్పష్టమైంది. ఒకవర్గానికి చెందిన నాయకుడు బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఆయన వద్ద ఉండి ఇన్‌చార్జి వద్దకు వెళ్లిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ఒక్కొక్కరినే తన వద్దకు రప్పించుకుంటున్నారు. ఆదివారం ముఖ్యనేతలు వస్తారన్న సమాచారంతో లేపాక్షి మండలానికి చెందిన కీలక ప్రజాప్రతినిధులను తన వద్దకు రప్పించుకున్నారు. మున్సిపల్ తాత్కాలిక చైర్మన్ బలరాంరెడ్డి సైతం ఆ నేత వద్దకే వెళ్లారు. చిలమత్తూరు మండలానికి చెందిన ముఖ్యనాయకులు, కొంతమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కూడా అక్కడకే వెళ్లడం బట్టి ఆయన తనవర్గాన్ని బలపరుచుకున్నట్లు స్పష్టమైంది. దీనినిబట్టి మరికొన్నిరోజుల్లో ఇన్‌చార్జి వద్ద ఉన్న వర్గం మొత్తం అక్కడకు రప్పించుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదన్న చర్చ ఆ పార్టీలో సాగుతోంది. దీపిక వర్గం.. సదరు ముఖ్యనేతపై వేటువేయాలని డిమాండ్ చేస్తుంటే.. నియోజకవర్గంలో ఆయన మాత్రం బలం పెంచుకుంటున్నారు. ఆ నేతకు అధిష్టానంలో కీలకమైన నాయకుడి అండ పుష్కలంగా ఉండటంతో ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారన్న చర్చ వైసీపీలో సాగుతోంది.

అధిష్టానం వద్ద తేల్చుకుంటాం..

హిందూపురానికి వచ్చిన ముఖ్యనేతలు ఇన్‌చార్జి దీపిక కార్యాలయంలో సమావేశమై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని బహిష్కరించాలని కొంతమంది నాయకులు డిమాండ్ చేశారు. ఏకనాయకత్వం ఉండాలని కోరారు. అయినా ఒకవర్గం మాత్రం తగ్గేదేలేదనీ, అధిష్టానం వద్దే తేల్చుకుంటామని గట్టిగా చెబుతోంది. గత టీడీపీ హయాంలో ప్రతిపక్షంలో ఉండి పార్టీని కాపాడుకున్నామనీ, అలాంటి తమనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తే చూస్తూ ఊరుకుండేది లేదని వారు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే అధిష్టానం వద్దకు వెళ్లే యోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే ఓ నిర్ణయం ఉంటుందని ముఖ్య నేతలు చెప్పి వెళ్లారు. దీనిని బట్టి ఆ నిర్ణయం ఏమిటా అన్న చర్చ సాగుతోంది. ఇన్‌చార్జిని త్వరలోనే మార్చవచ్చని ఒక వర్గం వారు అంటుంటే.. ఒకరిద్దరు ముఖ్య నేతలను పార్టీ నుంచి బహిష్కరించవచ్చని మరో వర్గం వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న టెన్షన్ ఆ పార్టీ వర్గాల్లో నెలకొంది.

ప్రకృతి గీసిన చిత్రాలు..!



వినువీధిని చీల్చుకు
వస్తూ భానుడు..
వడివడిగా అడుగులు
వేసే వేళ..
రెక్కలు తొడిగిన ఆకాశం
రివ్వు రివ్వున
ఎగిరే పక్షులతో...



అనంతపురం నగర శివారులో...

అహుడాను అగ్రస్థానంలో నిలుపుతా

నూతన అధ్యక్షుడు టీసీ వరుణ్

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం



తరలివచ్చిన పార్టీ శ్రేణులు

అనంతపురం క్రైం/ప్రెస్‌క్లబ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అహుడాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలోకి తీసుకెళ్తామని నూతన చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. నగరంలోని అహుడా కార్యాలయానికి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పాదాభివందనాలు తెలిపారు. జిల్లాలో జనసేన పార్టీ కొన్నేళ్లుగా ముందుకెళ్తోందని, తమ నాయకుడు తమపై నమ్మకముంచి ఈ పదవి ఇచ్చారని అన్నారు. బాధ్యతగా పని చేసి ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 57 మండలాల పరిధిలో అహుడాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళతానని అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఎంఐజీ లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. అహుడా పరిధిలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని అన్నారు. అహుడా అనుమతి లేకుండా వేసిన లే అవుట్ల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

తరలివచ్చిన నాయకులు

అహుడా చైర్మన్‌గా టీసీ వరుణ్ ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో జనసేన కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. కూటమి నాయకులు భారీగా తరలివచ్చారు. టీసీ వరుణ్‌ను ఆయన నివాసం నుంచి బైకు ర్యాలీ నడుమ అహుడా కార్యాలయానికి తీసుకొచ్చారు. వేద పండితులు, ముస్లిం, క్రిష్టియన్ మతపెద్దలు ఆశీర్వదించారు. అనంతరం టీసీ వరుణ్ ప్రమాణ స్వీకారం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ టీసీ వరుణ్ నివాసానికి వెళ్లి సత్కరించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, మాజీ మేయర్ స్వరూప, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, ఎంపీ అంబికా కుమారుడు వీక్షిత్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రోటరీ క్లబ్ కేశవరెడ్డి, నాయకులు సంపత్, గల్లా హర్ష, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, లిఖిత్‌రెడ్డి, చలపతి పాల్గొన్నారు. అహుడా సెక్రటరీ గౌరీశంకర్, ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, డీఈ రేవంత్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నాయకులు

రీచార్జ్ చేస్తేనే కరెంటు..!

విద్యుత్ కనెక్షన్లకు కొత్త స్మార్ట్ మీటర్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు
- మొదటి విడతలో 2.93లక్షల మీటర్లు బిగింపు
- మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్ చేయాల్సిందే

అనంతపురంరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ సంస్థ కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. గతంలో విద్యుత్ మీటర్ నెంబరు ఆధారంగా నెలవారి బిల్లు ఇచ్చేవారు. ఆ తరువాత మెషీన్ల ద్వారా రీడింగ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు ఇచ్చేవారు. ఇప్పుడు కొత్తగా స్మార్ట్ మీటర్లను ప్రవేశపెట్టారు. మొబైల్ ఫోన్‌కు ఏవిధంగా అయితే రీచార్జ్ చేసుకుంటే పనిచేస్తాయో...అదే రీతిలో ఈ స్మార్ట్ మీటర్లు పనిచేయనున్నాయి. ఇది విద్యుత్ సంస్థలు, వినియోగదారులకు ఉభయ కుశలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2.93లక్షల కనెక్షన్లకు బిగింపు

ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 15.96లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు సంబంధించి 11.21లక్షలు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు 1.21లక్షలు, పరిశ్రమలు, 11,591, తాగునీటి పథకాలు, వీధిదీపాలు, మున్సిపాల్టీలు సంబంధించి 26,061, వ్యవసాయ కనెక్షన్లు 3.15లక్షల కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండు వందల యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం చేస్తున్న గృహ, పరిశ్రమలు, వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఉపకేంద్రాల్లో 11కేవీ, 33కేవీ ఫీడర్లు, హేవీ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో భాగంగా ఆయా సర్వీసుల్లో ఎంపిక సర్వీసుల మేరకు 2,93,310 కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 17,333 మీటర్లు బిగించారు. ఇందులో అనంతపురం డివిజన్‌లో 4006, గుత్తిలో 5121, కళ్యాణదుర్గం 2325, పుట్టపర్తి డివిజన్ 1252, కదిరి డివిజన్‌లో 1668, హిందుపురం డివిజన్‌లో 2961 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మొబైల్ రీచార్జ్ తరహాలో ప్రీపెయిడ్

విద్యుత్ శాఖ ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు మొబైల్ రీచార్జ్ తరహాలో పని చేయనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెబుతున్నారు. ఈ యాప్ ద్వారా మొబైల్ ఫోన్ ద్వారా తమ ఇంటి కరెంటు సర్వీసు నెంబరు నమోదు చేసుకుని తద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే సౌలభ్యాన్ని తీసుకొనిరానున్నట్లు వెల్లడిస్తున్నారు. వినియోగదారులు ఎంత సొమ్ము అయితే రీచార్జ్ చేసుకుంటారో ఆ సొమ్ము అయిపోయేంతవరకు సరఫరా ఉంటుందని చెబుతున్నారు. మొబైల్ రీచార్జ్ తరహాలోనే విద్యుత్ రీచార్జ్ డబ్బు అయిపోయే వారం రోజుల ముందు నుంచి ఫోన్‌లకు సమాచారం వస్తుందని అంటున్నారు. ఒక వేళ రీచార్జ్ తేదీ గడువు ముగిసినా సరఫరా ఆగిపోకుండా కొంత సమయం ఉంటుంది. ఆ సమయం ముగిస్తే ప్రస్తుతం ఏవిధంగా అయితే అపరాధ రుసుముతో చెల్లించే వీలుంటుందో అదేవిధంగా చెల్లించేందుకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ ఇప్పటికీ ఇంకా మొదలు కానప్పటికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తి అయిన తరువాత ప్రారంభం అయ్యే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

సేవలు మరింత సులభతరం చేయడానికి...

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వినియోగదారులకు అందించే విద్యుత్ సేవలను మరింత సులభతరం చేయడానికేనని విద్యుత్ అధికారులు అంటున్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ఎంత విద్యుత్ వినియోగం జరిగితే ఆమేరకు డబ్బు కట్ అవుతుంది. చాలా మంది తమకు ఎక్కువ బిల్లు వస్తోందని చేస్తున్న ఫిర్యాదులకు పరిష్కారం దొరుకుతుంది. ఇంట్లో రోజువారిగా ఎంత కరెంటు వినియోగిస్తున్నాం. ఏ ఎలక్ట్రానిక్ వస్తువు ఎంత కరెంటు లాగింది వంటి విషయాలను తెలుసుకునే వీలుంటుందని చెబుతున్నారు. వినియోగదారులు క్యూలైన్‌లో నిలబడి బిల్లులు చెల్లించే పని లేకుండా ఇళ్లలో నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఎప్పటికప్పుడు మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ సర్వీసుకు రీచార్జ్ చేసుకునే సౌకర్యం ఉంటుంది. స్మార్ట్ మీటర్లలో ఏర్పాటు చేసిన ఇన్‌బిల్ట్ సిమ్ ద్వారా మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే అవకాశం ఉంటుంది. ఎన్ని యూనిట్లు వినియోగించాం. రీచార్జ్ ఎంత చేశాం. ఎప్పుడు ముగుస్తుంది వంటి వివరాలు ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులు తెలుసుకునే వీలుంటుంది.



నారాయణపురం పంచాయతీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

సేవలను చేరువ చేసేందుకే...



వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు జరుగుతోంది. వినియోగదారులకు వచ్చే సమస్యలను ఇందులో సులభంగా తెలుసుకోవచ్చు. విద్యుత్ ఎక్కడ వృథా అవుతోంది. సమస్యలు ఎక్కడ తలెత్తుతున్నాయి వంటి విషయాలను క్షేత్రస్థాయిలోని అధికారులతోపాటు మేము తెలుసుకునేందుకు వీలుంటుంది. అందుకు అనుగుణంగా పనులు చేస్తే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతోపాటు సంస్థకు నష్టాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.

- సంపత్ కుమార్, ఎస్ఈ విద్యుత్ శాఖ

ప్రజా ధనం రాళ్ల పాలు..!

వృథాగా పడి ఉన్న రీసర్వే రాళ్లు

నాటడానికి ఒప్పుకోని కొందరు రైతులు



వెస్టునరసాపురం సచివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న రీసర్వే రాళ్ల

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం రైతులకు వారి పొలాల సరిహద్దులు చూపి, నాటడానికి తెచ్చిన రాళ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో సైతం ఈ రాళ్లను పూర్తిగా వాడలేదు. దీంతో కొన్ని రైతుల పొలాల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద వృథాగా పడి ఉన్నాయి. జగన్ బొమ్మ ఉన్న ఈ రాళ్ల కోసం అప్పట్లో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిందనే విమర్శలు వినిపించాయి. అయితే రీ సర్వేను తప్పుల తడకగా చేశారని ఆరోపిస్తూ పలువురు రైతులు రాళ్ల నాటడానికి ఒప్పుకోలేదు.

ఒక్కో రాయికి రూ.450 ఖర్చు

మండలంలోని 11 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి కావడంతో 10 గ్రామాలకు 8వేలకు పైగా సర్వేరాళ్ల వచ్చాయి. అయితే సరిహద్దులు సక్రమంగా వచ్చి, రైతులు ఒప్పుకున్న చోట మాత్రమే ఈ రాళ్లను పూడ్చారు. అలా ఇప్పటి వరకు దాదాపు రెండు వేల రాళ్లను పూడ్చినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వాటిలో కొన్ని రాళ్లను సచివాలయాలు, గ్రామ నౌకర్ల దొడ్లలో ఉంచారు. చాలా గ్రామాల్లో రైతుల పొలాల్లో వేసినా, వాటిని హద్దులకు పూడ్చలేదు. ఈ సర్వే రాయి విలువ ఒక్కోక్కటి రూ.450పైమాటేనని అధికారులు చెబుతున్నారు. రాయి, దానిమీద జగన్ బొమ్మతో కలిపి రూ.300 టెండర్ అని, దాన్ని పొలం హద్దు వద్ద పూడ్చడానికి మరో రూ.150 ప్రభుత్వం నుంచి వచ్చింది.

రాళ్లు పూడ్చనివ్వలేదు: గంగిరెడ్డి, రైతు



మా ఊరు రాచేపల్లిలో రీసర్వే పనులు చేపట్టారు. అయితే ఎక్కడా సర్వే సక్రమంగా పూర్తి కాలేదు. భూ విస్తీర్ణాలు హెచ్చు తగ్గులు రావడంతో రాళ్లను పూడ్చనివ్వలేదు. రీసర్వే పనులకు నిధులను దుర్వినియోగం చేశారు తప్ప రైతులకు ఎక్కడ మేలు జరగలేదు.

సర్వే రాళ్లను వద్దన్నాం: లక్ష్మిరెడ్డి, రైతు



మాది నిదనవాడ గ్రామం. రీసర్వే పనుల్లో భూముల విస్తీర్ణంలో తేడాలు వచ్చాయి. జగనన్న భూహక్కు పుస్తకం ఇవ్వడానికి గ్రామసభ ఏర్పాటు చేశారు. అప్పుడు రైతు అందరు కలసి మా భూముల వివరాలు ఖచ్చితంగా వచ్చే వరకు పుస్తకాలు తీసుకోమని తెగేసి చెప్పాం. రీ సర్వే రాళ్లు తీసుకొస్తామని అధికారులు తెలిపిన మా సమస్య పరిష్కరించేవరకు వద్దన్నాం.

రైతులు ఒప్పుకున్న చోటే నాటాం



రీసర్వే తరువాత ఇప్పటికే ఎల్‌సీ నంబర్ల ఇచ్చి పాసుపుస్తకాలు రైతులకు అందజేశాం. అయితే రైతులు ఒప్పుకున్న చోటే సరిహద్దులకు సర్వే రాళ్లను నాటాం. రైతులను బలవంతం చేసి ఎక్కడానాటలేదు.

- పునీత్‌బాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్

న్యూస్‌బాక్స్

ఫైనల్ పోటీలో ఓడిన సెపక్ తక్రా జట్టు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సెపక్ తక్రా పోటీలలో అనంతపురం జిల్లా బాలుర జట్టుకు ఫైనల్స్‌లో ఓటమి ఎదురైంది. విజయవాడ నగరంలోని పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ అండర్-13 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జట్లు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాయి. బాలుర ఫైనల్స్‌లో అనంతపురంపై 15-9, 15-11తో, బాలికల ఫైనల్స్‌లో పశ్చిమగోదావరిపై 15-6, 15-2తో కృష్ణా జట్లు గెలిచాయి. పోటీల్లో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని పోటీల పరిశీలకుడు ఏపీ రాజు ప్రకటించారు. రాష్ట్ర జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కడం విశేషం.

బాలురు జట్టు: ఎండీ జాకీర్ అహ్మద్, ఎస్.కార్తీక్(కృష్ణా), ఎం. రేవంత్(అనంతపురం), జి.సందీప్(తూర్పుగోదావరి), కె.అభిలాష్(పశ్చిమగోదావరి), బాలికలు: వి.కావ్య, ఎండీ రెహ్నూమ(కృష్ణా), కె.వర్షిణి(పశ్చిమగోదావరి), ఎన్ కవిత(నెల్లూరు), ఎం భానుప్రియ(అనంతపురం).

స్టోర్ డీలర్ల భర్తీకి అడుగులు

జిల్లాలో 710 ఖాళీ

అనంతపురం టౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): చౌక ధరల ధాన్యపు డిపో డీలర్ పోస్టుల భర్తీకి టీడీపీ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆశాఖ కమిషనరు జిల్లా శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న చౌకడిపోలను గుర్తించారు. పౌరసరఫరాల శాఖ అధికారుల లెక్కల మేరకు జిల్లాలో 1645డీలర్ షాపులు ఉన్నాయి. ఇందులో 710 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి జిల్లా యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. డిసెంబరు మొదటివారంలో వీటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఇప్పటికే కమిషనరు, కలెక్టరు ఆదేశాల మేరకు ఆర్డీఓలు డివిజన్‌లవారీగా ఖాళీలను గుర్తించారు. రెండు వారాలు పాటు దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం పోటీపరీక్ష పెట్టి, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అదేరోజే ఎంపికైన అభ్యర్థులకు డీలర్‌గా నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు డీఎస్ఓ తెలిపారు.

చీనీ టన్ను రూ. 34వేలు

అనంతపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.34,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 21,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 127 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

- ఆర్టీసీ బస్సుపై రాయితో దాడి

అనంతపురం క్రైం,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. పక్కకు తప్పుకోమని ఆర్టీసీ డ్రైవర్ హారన్ కొట్టినందుకు బస్సుపై రాయితో దాడి చేశాడు. ఈ ఘటన అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్ తెలిపిన మేరకు... నగరంలోని జాకీర్ కొట్టాలకు చెందిన అహ్మద్ కళ్యాణదుర్గం రోడ్డులోని ఓ వైన్‌షాపులో మద్యం తాగి, రోడ్డు పక్కనే నిలబడ్డాడు. అదే సమయంలో అనంతపురం నుంచి రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వచ్చింది. అడ్డుగా ఉండటంతో పక్కకు వెళ్లాలని సూచిస్తూ డ్రైవర్ హారన్ కొట్టాడు. అంతే అహ్మద్‌కు కోపమొచ్చింది. మద్యం మత్తులో ... అన్ని సార్లు హారన్ కొడతావా అంటూ అక్కడున్న రాయి తీసుకుని బస్సుపై విసిరాడు. ఈ ఘటనపై బస్సు కండక్టర్ గోపాల్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బాలిక అదృశ్యం...


నగరంలో ఓ బాలిక అదృశ్యమైంది. జనశక్తినగర్‌కు చెందిన బాలిక పదో తరగతి చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి 8.30గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడం, సోమవారం ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నర్సు...

నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సు ఇంటి నుంచి అదృశ్యమైంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... షిరిడీనగర్‌కు చెందిన నర్సు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆనంద్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. భర్త హరితో కలిసి షిరిడీనగర్‌లో నివాసముంటోంది. వీరికి సంతానం లేదు. ఈ క్రమంలో మేఘన ఆదివారం రాత్రి 8గంటల సమయంలో బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త హరి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

30న జిల్లాకు సీఎం చంద్రబాబు రాక

రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటన



అనంతపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 30న జిల్లాకు రానున్నారు. జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంలో ఏదైనా ఒక గ్రామంలో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా వెలువడాల్సి ఉంది. అయితే ముఖ్యమంత్రి పర్యటన దాదాపుగా ఖరారైనట్లు ఆ పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బొమ్మనహాళ్ మండలంలో ఏ గ్రామంలో చంద్రబాబు పర్యటించాలో అందుకు అనుగుణంగా ఆ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రతినెలా ఏదో ఒక జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములవుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు రచ్చబండ తరహాలో... ఆ గ్రామ ప్రజలతో ముఖ్యమంత్రి సమావేశంకానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోంది.

ఎన్టీఆర్ ట్రస్టు స్కాలర్‌షిప్‌ను సాధించండి

ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన



పరీక్ష ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించే గర్ల్స్ ఎడ్యుకేషన్ స్కాలర్ షిప్ పరీక్షలో ప్రతిభ చాటి ఉపకార వేతనం పొందాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ఎన్టీఆర్ కళాశాల ప్రతినిధి కృష్ణారెడ్డితో కలిసి పరీక్షా ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నారన్నారు. డిసెంబరు 8న హైదరాబాద్ గండిపేటలోని ఎన్టీఆర్ కళాశాలలో స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షల్లో మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు నెలకు రూ.5వేలు చొప్పున, ఆ తర్వాతి 15 ర్యాంకులకు నెలకు రూ.3వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తారన్నారు. వివరాల కోసం 9908551643, 7660002627, 7660002628 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

జల్‌జీవన్ మిషన్ పథకం అమలుపై ఆరా



నీటి నాణ్యత పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కేంద్ర కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం అమలు తీరుపై నేషనల్ జలజీవన్ మిషన్ సభ్యులు జాలి కేశవన్, సురేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఉదయం ఈఈ మురళీధర్‌రావు, ఎస్ఈ పీప, డీఈ శ్రీరాములుతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలోని ఎస్ఈ చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. పథకం అమలుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని పిలిపించి క్షేత్రస్థాయిలో అమలు తీరుపై ప్రశ్నించారు. సిబ్బంది సమాధానం చెప్పలేక నీళ్ల నమిలినట్లు సమాచారం. అయితే డీఈ, ఈఈలు దగ్గర ఉండటంతో తగిన విధంగా వివరణ ఇచ్చారు. అనంతరం శింగనమల డివిజన్ కార్యాలయం సమీపంలో ఉన్న నీటి శుద్ధి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈలు శ్రీరాములు, రేహనా వసీంలతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి స్థానిక ప్రజలతో పథకం అమలుపై ఆరా తీశారు. గుత్తి మండలంలోని పాతకొత్తపేట, పామిడి మండలంలోని ఎద్దులపల్లి, బుక్కరాయసముద్రం మండలంలోని వడియం పేట తదితర ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ పథకం అమలు తీరును పరిశీలించారు.

ఉద్యోగ కల్పనలో గేమ్ చేంజర్

పీఎం ఇంటర్న్‌షిప్

500 కంపెనీల్లో కోటిమందికి ఉద్యోగాలు

మంత్రి సత్యకుమార్ యాదవ్



ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కల్పిస్తున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ఉద్యోగ కల్పన గేమ్‌చేంజర్ అని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో పీఎం ఇంటర్న్‌షిప్ పథకంపై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. తమ పిల్లలు ఉద్యోగాలను సంపాదించి, స్థిరపడాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు కష్టాలకోర్చి చదివిస్తున్నారన్నారు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు పూర్తిచేసినా సరైన ఉద్యోగావకాశాల్లేక తల్లిదండ్రుల కలలు నెరవేడంలేదన్నారు. దేశంలో పారిశ్రామిక, ఐటీ తదితర రంగాలు అభివృద్ధి చెందుతున్నాయనీ, వాటిలో ఉద్యోగం పొందాలంటే సంస్థలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అవసరమన్నారు. ఏటా లక్షలమంది విద్యార్థులు కళాశాలల్లో విద్యను పూర్తిచేసుకుని బయటకు వస్తున్నా నైపుణ్యలోపంతో ఉద్యోగాలు పొందడం లేదన్నారు. ఈ సమస్యలను అధిగమించి విద్యార్థులు, సంస్థలకు అనుసంధానం చేసేలా ఇంటర్న్‌షిప్ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చారని తెలిపారు. కోటిమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు దేశవ్యాప్తంగా 500 కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఫార్మసీ తదితర కోర్సులు, అర్హతకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇస్తే కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పొందేందుకు దోహదపడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 12 నెలలు సంబంధిత కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ పూర్తవుతుందన్నారు. అనంతరం ఆయా కంపెనీలు ఉద్యోగులుగా అడాప్ట్ చేసుకుంటాయన్నారు. ఇతర కంపెనీల్లోనైనా ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. స్వయం ఉపాధి పొందవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నిర్వాకం..!

- మూణ్ణాళ్ల ముచ్చటగా రోడ్డు పనులు
- రూ.కోటితో వేసిన రోడ్డు గుంతలమయం



ఉండబండ వద్ద పడి రోడ్డుపై ఉన్న గుంత



ఉండబండ ఆలయం వద్ద రోడ్డు దుస్థితి

విడపనకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి-ఉరవకొండ ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రూ.కోటి నిధులతో రెండేళ్ల కిందట నాలుగు కిలోమీటర్ల రోడ్డు పనులు చేశారు. మూడో కిలోమీటర్ నుంచి ఐదో కిలోమీటర్ వరకూ, 12.2వ కిలోమీటర్ వద్ద నుంచి 10.2వ కిలోమీటర్ వరకూ మొత్తం నాలుగు కిలోమీటర్లు తారు రోడ్డు వేశారు. ఈ రోడ్డు కనీసం రెండు సంవత్సరాలు కూడా చక్కగా నిలబడలేదు. ఎక్కడికక్కడ గుంతలు పడిపోయింది. వాహనాలు తిరగటానికి వీలు లేకుండా మారింది. మోకాలి లోతు గుంతలు పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు ఆందోళనతో ప్రయాణం చేస్తున్నారు. ఉరవకొండ నుంచి ఉండబండ, పాల్తూరు, హావళిగి గ్రామాలకు కర్ణాటక సరిహద్దు రూపనగుడి వరకూ రోడ్డు పూర్తిగా శిథిలమై పోయింది. ఈ 15కిలోమీటర్లు ప్రయాణం చేయాలంటేనే దాదాపుగా రెండు గంటలు పైగా సమయం పడుతోంది. అప్పట్లో వైసీపీ నేతలు రోడ్డుపై తారును పూతగా వేసి వదిలేశారు దీంతో పైపూత మొత్తం పోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.4 కోట్లు మంజూరు చేసింది.

ఎక్కడా గుంతలు పడలేదు: కావ్య, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఉరవకొండ

2022లో కోటి రూపాయలతో 3 నుంచి 5 కిలోమీటరు వరకూ, 12 నుంచి 14వ కిలోమీటరు వరకూ తారు రోడ్డు వేశారు. కానీ ఎక్కడా గుంతలు పడలేదు. రోడ్డును నాణ్యంగానే వేశారు. పాల్తూరు దాటిన తరువాత కొంత మంది రైతులు తమ పొలాలకు పైపులు వేసుకునేందుకు రోడ్డును తవ్వటంతో అక్కడ అక్కడ గుంతలు పడి శిథిలమయ్యింది. ప్రస్తుతం 0 నుంచి 11 కిలోమీటర్ల రోడ్డుకు రూ. 4కోట్లు, హావళిగి గ్రామం వద్ద నుంచి 15వ కిలోమీటరు నుంచి 19వ కిలో మీటరు కర్ణాటక సరిహద్దు రోడ్డు వరకూ నాలుగు కిలోమీటర్లకు రూ.35లక్షలు మంజూరు అయ్యాయి. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.



హావళిగి గ్రామం వద్ద రోడ్డు దుస్థితి



పాల్తూరు వద్ద శిథిలమైన రోడ్డు

తుస్సుమన్న ఓటీఎస్..!

- గత సర్కార్ మోసం
- జిల్లాలో 33,043 మంది లబ్ధిదారులు
- రూ.19 కోట్ల చెల్లింపు
- ఏళ్లు గడుస్తున్నా అందని పత్రాలు
- నగదు వెనక్కి ఇవ్వని వైనం





జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయం

అనంతపురం సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు గత వైసీపీ ప్రభుత్వం చుక్కలు చూపించింది. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం పేరుతో ఐదేళ్లలో చాలా మంది లబ్ధిదారులతో నగదు కట్టించుకుంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటికి నిర్దేశిత మొత్తాన్ని చెల్లిస్తే ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) పత్రాలు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వం 2021 డిసెంబరు 8న జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఓటీఎస్ పత్రాలను బ్యాంకులో పెట్టి రుణం పొందవచ్చని వెల్లడించింది. దీనిపై ప్రభుత్వం ఊదరగొట్టింది. ఆశించిన స్థాయిలో పథకం అమలు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 1.47 లక్షల మందిని ఓటీఎస్ కింద అర్హులను గుర్తించగా 33,043 మంది మాత్రమే నగదు చెల్లించినట్లు తెలిసింది. వీరిలో చాలామందికి ఓటీఎస్ పత్రాలు అందించలేకపోవడంతో ఆందోళన నెలకొంది. జిల్లాలో హౌసింగ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న వారిలో ఓటీఎస్ కింద 1,47,211 మంది లబ్ధిదారులను గుర్తించి వారి నుంచి రూ. 132.13 కోట్లు వసూలు చేయాలని అప్పటి యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. నానా అవస్థలు పడి 33,043 మంది లబ్ధిదారుల నుంచి రూ. 19 కోట్లు వసూలు చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్వాహకంతో జిల్లాలో ఓటీఎస్ లబ్ధిదారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. నగదు చెల్లించినప్పటికి ఏళ్ల తరబడి ఓటీఎస్ పత్రాలు ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. గుంతకల్లు, ఉరవకొండ, శింగనమల, రాయదుర్గం ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని సమాచారం. వీటికి తోడు ప్రభుత్వం కూడా మారడంతో తమను పట్టించుకునే వారే లేరని బాధితులు వాపోతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇప్పటికీ 30 శాతం మందికి పత్రాలు అందలేదని ఆ శాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. సంబంధిత అధికారులను అడిగితే పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నగదు చెల్లించిన వారికి ఓటీఎస్ పత్రాలు కానీ.. చెల్లించిన నగదుకానీ వెనక్కి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.



నగర శివారులోని జగనన్న లేఅవుట్

ప్రభుత్వానికి నివేదించాం



ఓటీఎస్ లబ్ధిదారుల్లో కొందరికి పత్రాలు కానీ, చెల్లించిన నగదు కానీ అందలేదన్నది వాస్తవమే. జిల్లాలో నియోజకవర్గాల వారిగా లబ్ధిదారులను గుర్తించి సమగ్ర సమాచారంతో ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదించాం. ఈ ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సదరు లబ్ధిదారులకు న్యాయం చేస్తాం. **- శైలజ, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ**

హత్యకేసు నిందితుడిని
పట్టించిన పెండ్లి పత్రిక



నిందితుడిని పట్టించిన పెళ్లికార్డు

- 26ఏళ్ల క్రితం పసిబిడ్డను హతమార్చి పరారైన తండ్రి
- పేరు మార్చుకుని కర్ణాటకలో జీవనం
- మళ్లీ పెళ్లి
- రెండో భార్య కూతురి పెండ్లి పత్రిక ఆధారంగా విచారణ
- నిందితుడి అరెస్టు

పుట్టపర్తి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కన్నబిడ్డ అని కూడా చూడకుండా ఆరు నెలల పసికందును గొంతు నులిమి అమానుషంగా చంపేశాడు. తోటలో పాతిపెట్టి పరారయ్యాడు. కర్ణాటకలోని మారుమూల ప్రాంతానికి చేరాడు. పేరు మార్చుకున్నాడు. వేరే పేరుతో ఓ రైతు తోటలో పనికి చేరాడు. అక్కడే ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఇలా 26 ఏళ్లు గడిచిపోయాయి. అంతా మరచిపోయారనుకున్నాడు. పోలీసులు పట్టించుకోలేదనుకున్నాడు. ఏమీ కాదులే అనుకున్నాడు. రెండో భార్య కూతురి వివాహానికి స్వగ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రుడిని ఆహ్వానించాడు. ఆ మేరకు వివాహ ఆహ్వాన పత్రిక కూడా పంపాడు. అక్కడ దొరికిపోయాడు. ఆ పత్రికను పట్టుకుని పోలీసులు కూపీలాగారు. మాటువేసి, నిందితుడిని పట్టుకున్నారు. 26 ఏళ్ల తరువాత కుమారుడిని చంపిన తండ్రిని అరెస్టు చేశారు. రివార్డులు, అభినందనలు అందుకున్నారు.

గుడిబండ మండలం దిన్నేహట్టిలో 26 ఏళ్ల క్రితం కుమారుడిని హత్య చేసి పరారైన తిప్పేస్వామి అలియాస్ కృష్ణ గౌడను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామికి 30 సంవత్సరాల క్రితం అదే ఊరికి చెందిన మేనత్త పట్టెమ్మ కుమార్తె కరియమ్మతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు జన్మించారు. భార్య ప్రవర్తనపై తిప్పేస్వామి అనుమానం పెంచుకున్నాడు. చిన్న కుమారుడు శివలింగయ్య (6నెలలు) తనకు పుట్టలేదని భావించిన తిప్పేస్వామి.. పసికందును ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈనేపథ్యంలో 1998 అక్టోబరు 2వ తేదీన ఉదయం దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని దిన్నేహట్టి సమీప పొలాల్లోని మారెమ్మ జమ్మికట్టకు ప్రదక్షిణ చేద్దామని భార్య, కుమారుడిని పిలుచుకెళ్లాడు. కుమారుడు శివలింగయ్యను ఎత్తుకుని కరియమ్మ ప్రదక్షిణ చేస్తుండగా తిప్పేస్వామి పిల్లవాడిని లాక్కుని పరారయ్యాడు. తన మామిడితోటలోకి వెళ్లి చిన్నారిని గొంతునులిమి చంపేశాడు. అక్కడే గొయ్యితీసి, పాతిపెట్టి పారిపోయాడు. దీనిపై కరియమ్మ 1998 అక్టోబరు 18న గుడిబండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో చార్జిషీట్ దాఖలు చేశారు.

పేరు మార్చుకుని..

కుమారుడిని చంపి పరారైన తిప్పేస్వామి కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లా ఆర్దురు గ్రామానికి చేరుకున్నాడు. జవారప్ప వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ ఉండేవాడు. పేరు మార్చుకుని కృష్ణగౌడగా వారికి పరిచయమయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన తారను పెళ్లి చేసుకున్నాడు. వీరికి తులసి, సౌమ్య ఇద్దరు కుమార్తెలు జన్మించారు. ఏళ్లు గడిచినా స్వగ్రామం దిన్నేహట్టిలోని స్నేహితుడు గొల్ల నాగరాజు అలియాస్ బాంబే నాగరాజుతో రహస్యంగా స్నేహం నెరుపుతుండేవాడు. ఈక్రమంలో తిప్పేస్వామి తండ్రి చిత్తప్ప ముసలివాడు అయ్యాడనీ, మొదటి భార్య కరియమ్మ కూడా గ్రామంలో లేదని బెంగళూరుకు వెళ్లిపోయిందనీ, కొడుకును చంపిన విషయం గ్రామస్థులు మరచిపోయారనీ, పోలీసుల కేసు కూడా లేదని నాగరాజు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఊరికొచ్చి భూమి భాగ పరిష్కారాలు చేసుకోవాలని స్నేహితుడు సలహా ఇచ్చాడు.

అరెస్టు ఇలా..

తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ నాలుగునెలల క్రితం తన చిన్న భార్య తార కూతురు సౌమ్య పెళ్లికి రావాల్సిందిగా వివాహ ఆహ్వాన పత్రికను నాగరాజుకు పంపాడు. నాగరాజు, అతడి భార్య న్యామనహళ్లిలో వివాహానికి హాజరై, వచ్చారన్న విషయం గ్రామస్థులకు తెలిసింది. దీనిపై సమాచారం అందడంతో ఎస్పీ రత్న.. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు.. నాగరాజును విచారించి, పెళ్లి పత్రికను సేకరించారు. నాగరాజు సలహా మేరకు భూముల భాగపరిష్కారం కోసం నెలకిందట దిన్నేహట్టికి తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడ వచ్చివెళ్లాడన్న పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేశారు. అందులో భాగంగా సోమవారం భాగ పరిష్కారం కోసం తన తమ్ముడు చిత్తప్ప, చెల్లెలు కంచమ్మతో పెద్దమనుషుల ద్వారా మాట్లాడడానికి మందలపల్లికి వెళ్లేందుకు దిన్నేహట్టి బస్టాండు వద్దకు తిప్పేస్వామి చేరుకున్నాడు. మడకశిర సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ మునిప్రతాప్.. సిబ్బందితో కలిసి వలపన్ని అతడిని పట్టుకున్నారని ఎస్పీ వివరించారు. నేరం చేసినవారు ఎప్పటికీ తప్పించుకోలేరన్న విషయం తిప్పేస్వామి అరెస్టు ద్వారా స్పష్టమైందని ఎస్పీ వివరించారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిబ్బందికి రివార్డులు

26 ఏళ్లుగా పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న తిప్పేస్వామి అలియాస్ కృష్ణగౌడను చాకచక్యంగా పట్టుకున్న పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు. రివార్డులను అందజేశారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై దాడి

- 26 మంది అరెస్టు
- రూ.13.18 లక్షలు స్వాధీనం



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

శింగనమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరువెందుల మొబైల్ పేకాట శిబిరంపై ఎస్పీ జగదీష్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ఆదివారం రాత్రి దాడులు నిర్వహించింది. తాడిప్రతికి చెందిన మొబైల్ గ్యాంబ్లిగ్ నిర్వహకుడు కడప, తాడిప్రతి, అనంతపురానికి చెందిన 40 మందితో మొబైల్ పేకాట అడిస్తున్నట్లు సమాచారం రావడంతో మెరుపు దాడి చేశారు. పేకాట అడుతున్న 26 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,18,560 నగదు, నాలుగు బైకులు, ఒక కారు, 23 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టు ఎదుట హాజరుపరిచామని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. పేకాట నిర్వాహకుడు ఖాదర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. రాచేపల్లికి చెందిన ఆదితో కలిసి ఖాదర్ పేకాట నిర్వహిస్తున్నాడని తెలిపారు. వీరిద్దరూ మద్యం, వ్యసనాలకు బానిసలయ్యారని, సులువుగా డబ్బులు సంపాదించేందుకు మొబైల్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. గార్లదిన్నె సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరగడంతో పోలీసులు బిజీగా ఉన్నారని, తమ గురించి పట్టించుకోరని భావించి.. ఇరువెందల వద్ద ముళ్ల పొదల్లో పేకాట ఆడించారని తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రజలకు ఉత్తమ సేవలు అందించండి

- కమాండెంట్ మహేష్ కుమార్



అనంతపురం క్రైం, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని ప్రజలకు మంచి సేవలు అందించాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జి కమాండెంట్ మహేష్ కుమార్ సూచించారు. నగరంలోని పరేడ్ మైదానంలో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని హోంగార్డ్స్ పరేడ్‌ను సోమవారం నిర్వహించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో గుర్తు చేసుకోవాలని అన్నారు. విధులు సవాళ్లతో కూడుకున్నవేనని, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్ఐ మధు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు గుంతకల్లు, గుత్తి మీదుగా శబరిమలకు 18 ట్రిప్పుల రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-కొట్టాయం (నం. 07133) ప్రత్యేక రైలు డిసెంబరు 5, 12, 19, 26 తేదీల్లో (గురువారాలలో) కాచిగూడలో మధ్యాహ్నం 3.40కి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6-50 గంటలకు కొట్టాయం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07134) డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో(శుక్రవారాలలో) కొట్టాయంలో రాత్రి ఎనిమిదిన్నరకు బయలుదేరి, మరుసటిరోజు రాత్రి 11-40 గంటలకు కాచిగూడకు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, కోయంబత్తూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. హైదరాబాద్-కొట్టాయం ప్రత్యేక రైలు (నం. 07135) డిసెంబరు 3, 10, 17, 24, 31 తేదీల్లో (మంగళవారాలలో) హైదరాబాదులో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4-10 గంటలకు కొట్టాయంకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07136) డిసెంబరు 4, 11, 18, 25, జనవరి 1వ తేదీలలో (బుధవారాలు)సాయంత్రం 6-10 గంటలకు కొట్టాయంలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11-45 గంటలకు హైదరాబాదుకు చేరుతుందని తెలియజేశారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, శంకర్‌పల్లి, వికారాబాద్, తాండూరు, సేరం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పట్టి, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం స్టేషన్ల మీదగా వెళ్తుందని వివరించారు.

రైల్వే స్టేషన్లలో క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు

నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించడం కోసం రైల్వే శాఖ పలు రైల్వే స్టేషన్లలోని పార్సల్ ట్రాన్స్‌పోర్టేషన్ కార్యాలయాల్లో డబ్బు చెల్లించడానికి క్యూఆర్ కోడ్స్‌ను ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. దక్షిణ మధ్య రైల్వేలోని ఆరు డివిజన్లలో 35 రైల్వే స్టేషన్లలో పార్సిల్ కేంద్రాలలో క్యూఆర్ కోడ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని డివిజనల్ కేంద్రంతోపాటు కడప, అనంతపురం, రాయచూరు, ధర్మవరం, తిరుపతి, రేణిగుంట, డోన్, చిత్తూరు రైల్వే స్టేషన్లలో ఈ ఏర్పాటు చేయనున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

- 5 నుంచి ప్రక్రియ
- 194 సంఘాలకు ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, నవం బరు 25(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలకు షెడ్యూల్ ప్రకటించారు. సాగునీటికి ప్రధాన పునాదిగా ఉన్న వాటర్ యూజర్ అసోసియేషన్ (డబ్ల్యూయూఏ) సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు శ్రీకారం చుట్టారు. హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194 సాగునీటి సంఘాల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మొదట అక్టోబరు 16 నుంచి నవంబరు 24వతేదీలోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిసెంబరు 5 నుంచి 8వతేదీలోపు సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని తాజాగా కొత్త షెడ్యూల్ విడుదల చేసింది.

ఇదీ ఎన్నికల షెడ్యూల్

జలవనరుల శాఖలో కీలకంగా వ్యవహరించే సాగునీటి ఆయకట్టు (సాగునీటి వినియోగదారులు) సంఘాలను ఎన్నుకుంటారు. డిసెంబరు 5న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 8న జిల్లావ్యాప్తంగా ఉన్న 194 సాగునీటి సంఘాల ఎన్నిక, అదే రోజు సర్వసభ్యసమావేశాలు నిర్వహిస్తారు. 11వ తేదీన జిల్లాలోని 12 డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. 14న తుంగభద్ర, భైరవానితిప్ప ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కమిటీలను ఎన్నుకుంటారు.

194 సంఘాలకు ఎన్నికలు

జిల్లాలో మొత్తం 194 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. తుంగభద్ర ప్రాజెక్ట్ ఎగువ కాలవ (టీబీపీ హెచ్చెల్సీ) పరిధిలో 99 సాగునీటి సంఘాలను గుర్తించారు. ఇందులో హెచ్‌ఎల్‌ఎంసీ 11 సాగునీటి సంఘాలకు 35,541 ఎకరాలు ఉంది. మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ 5 సంఘాలకు 13,325 ఎకరాలు, మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్ 10 సంఘాలకు 29,577 ఎకరాల ఆయకట్టు ఉంది. తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 25,478 ఎకరాల ఆయకట్టుకు 9 సంఘాలు ఉన్నాయి. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11 సంఘాల కింద 32,072 ఎకరాల సాగు ఉంది. అనంతపురం జిల్లాలో 5డిస్ట్రిబ్యూటరీ సంఘాల పరిధిలో 46 సాగునీటి సంఘాలు ఉన్నాయి. మొత్తం హెచ్చెల్సీ పరిధిలో 12డిస్ట్రిబ్యూటరీల కింద 99సాగునీటి సంఘాలను గుర్తించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో జిల్లాలో 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మేజర్ ప్రాజెక్ట్‌గా భైరవానితిప్ప (బీటీపీ) ప్రాజెక్ట్ కింద 6, చెరువులు 89 మొత్తం 95 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో అసోసియేషన్‌కు 20-50 ఎకరాల ఆయకట్టు రైతులు ఓటర్లుగా టీసీని ఎన్నుకుంటారు. టీసీ (టెరిటోరియల్ కాన్‌స్టియెన్సీ)లు కనీసం 6-12 మంది కలిసి వాటర్ యూజర్ అసోసియేషన్‌లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, ప్రభుత్వ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ కోటాలో భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉన్నత విద్యాశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. సెట్‌లో అర్హత సాధించనివారు, పీజీసెట్‌కు హాజరుకానివారికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించవచ్చని ఉన్నత విద్యామండలికి స్పష్టంచేశారు. ఈ కోటాలో అడ్మిషన్లు పొందేవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదన్నారు.

ఎస్ఎంసీ విధులపై స్పష్టత ఇవ్వాలి

అమరావతి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) విధులపై స్పష్టతనిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్ఎంసీలకు నిర్దేశించిన పనుల భారం ఉపాధ్యాయులపై పడకుండా చూడాలన్నారు. అలాగే ఎస్ఎంసీలు మరింత బలోపేతం కావాలంటే వారికి గౌరవ వేతన ఇవ్వాలని సూచించారు.

సాయి సేవలో వైద్యులు

పుట్టపర్తి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంతి వేడుకల సందర్భంగా సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో 10,262 మందికి సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో భారత్‌తో పాటు అమెరికా, నేపాల్, యూకే, మలేషియా, ఇండోనేషియా, ఆస్ట్రేలి యా, దక్షిణాఫ్రికా చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఈ నెల 18వ నుంచి సోమవారం వరకు 8 రోజుల పాటు వారు ఈ సేవలు అందించారు. నేషనల్ మెడికల్ ఇన్‌చార్జ్ రామ్‌మనోహర్‌రావు, ఇంటర్నేషనల్ ఇన్‌చార్జ్ గీతాకామత్ ఆధ్వర్యంలో 61 వైద్యబృందాలు పాల్గొన్నాయి. ప్రశాంతి నిలయంలోని ఉత్తర భవనం-1 వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సాయి భక్తులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

ఆర్ఎంపీకి నోటీసులు

ముదిగుబ్బ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఎంపీ ఇందుకూరు బాషా క్లినిక్‌లో వైద్యం చేసుకోవడంతో తనకు కిడ్నీ సమస్య వచ్చిందని, మండలంలోని దొరిగిల్లుకు చెందిన రమణ.. జిల్లా వైద్యాధికారులకు రెండురోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేంద్రనాయక్, డీఈఎంఓ బాబాఫకృద్దీన్ ముదిగుబ్బకు వచ్చి ఆ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆర్ఎంపీ డాక్టర్‌కు నోటీసులు అందజేశారు. వారి వెంట మండల వైద్యాధికారి శ్వేత, సిబ్బంది ఉన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

పెనుకొండ: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 1న ధర్మవరంలో నిర్వహించే కవితోత్సవంలో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా కోరారు. చేనేత కష్టాలు, వృద్ధాప్యం అంశాలపై 20 లైన్‌లకు మించని కవితలను, పాటలను వినిపించవచ్చని తెలిపారు. వివరాలకు 94409 29894, 9494018465ను సంప్రదించాలని సూచించారు.

న్యాయం కోసం రైతుల ఆందోళన

కదిరి అర్బన్: తమకు న్యాయం చేయాలని మండలంలోని కాళసముద్రానికి చెందిన పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గ్రామ పొలం సర్వేనెంబర్ 128లో 12 ఎకరాల 15 సెంట్లు భూమిలో ఏడు గురు రైతులకు హక్కు ఉందన్నారు. ఆదే గ్రామానికి చెందిన గంగులప్పకు ఇదే సర్వేలో 75 సెంట్లు భూమి ఉందన్నారు. మిగిలిన భూమిలో పఠాన్, షబానా, జిలాన్, మాబూసాబ్, గౌస్‌మోద్దీన్, రేష్మా, బాబ్‌జాన్‌కు సంబంధించిన భూమి ఉందన్నారు. గంగులప్ప తనకున్న భూమితో పాటు ఇంకా భూమి ఉందని అడ్డుపడుతున్నట్లు చెప్పారు. సర్వేయర్లు సర్వే చేసి చెప్పినా గంగులప్ప వినడంలేదన్నారు. రెవెన్యూ అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

సీఐగా శివరాముడు

ముదిగుబ్బ: మండలంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా శివరాముడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కూడేరు సర్కిల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి సీఐ యతీంద్ర తిరుపతి ఆర్ఎస్‌కు బదిలీపై వెళ్లారు.



బత్తలపల్లి: ఓంకారేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

శైవక్షేత్రాలకు కార్తీక శోభ

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: బత్తలపల్లి మండలంలోని శివాలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి.. స్వామి వారిని దర్శించుకున్నారు. మండలంలోని సంఘ మేశ్వర క్షేత్రానికి, సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రానికి, బత్తలపల్లిలో కొత్తగా నిర్మించిన లలితా త్రిపుర సుందరిదేవి ఓంకారేశ్వర ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కదిరి పట్టణంలోని శివాలయంలో శివలింగ, శివ పార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ధర్మవరం మండలంలోని కుణుతూరు గ్రామంలో వెలసిన పురాతన ఆలయమైన శ్రీచంద్రమౌ శేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి కాటకోటేశ్వరక్షేత్రంలో, ఓడీసీ మండలం గౌనిపల్లి సమీపంలో స్వాములాజుల కొండలోని అక్కదేవతల ఆలయంలో అక్కదేవల ఆఖండ జ్యోతి ప్రజ్వలన ఘనంగా నిర్వహించారు. పలగలపల్లికి చెందిన దేవనాగప్ప, దేమ మునెమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేశారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

తాడిమర్రి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో సోమవారం చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామపెద్దల జ్యోతుల బోనాలు ముందుగా సమర్పించి.. ఈ ఉత్సవాలను ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.



పెద్దకోట్లలో జ్యోతులకు హాజరైన భక్తులు, అలంకరణలో చౌడేశ్వరి దేవి (ఇన్‌సెట్లో..)

30న శివలింగం ప్రతిష్ఠించనున్న ముస్లిం

ఓబుళదేవరచెరువు: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై అయ్యప్ప ఆలయంలో మహమ్మద్ రఫీ తన సొంత నిధులతో శివాలయాన్ని నిర్మించాడు. అందులో ఈనెల 30న శివలింగాన్ని మహమ్మద్ రఫీ ప్రతిష్ఠించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం స్థానిక తహసీలార్ కార్యాలయంలో తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మతాలకు అతీతంగా ఓ ముస్లిం శివాలయాన్ని నిర్మించి.. అందులో శివలింగాన్ని ప్రతిష్ఠ చేస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

ధర్మవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బేల్దారి సంఘానికి సంబంధించిన పుస్తకాలు ఇవ్వలేదని ఇరు వర్గాలు సోమవారం ఘర్షణ పడ్డాయి. పట్టణానికి చెందిన ముక్తం ఈశ్వరయ్య బేల్దారి సంఘం తాజా మాజీ అధ్యక్షుడు. ప్రస్తుతం ఆ సంఘం అధ్యక్షుడు కత్తే నాగరాజు. ఆ సంఘానికి సంబంధించిన పుస్తకాలు విషయంలో రెండు నెలలుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఈశ్వరయ్య, అతని వర్గీయులు, కత్తే నాగరాజు, కత్తే ప్రశాంత్, రఘు, లక్ష్మణ వర్గీయులు దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఈశ్వరయ్య, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. ఈశ్వరయ్యను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల వారు పోలీసులకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. కేసులు దర్యాప్తులో ఉన్నాయి.

నేడు, రేపు యువ ఉత్సవ్

కదిరి అర్బన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం, బ్లూమూన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళ, బుధ వారాల్లో నిర్వహించే జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌ను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక తన నివాసంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఉత్సవ్‌లో పలు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన యువతకు ఎమ్మెల్యే నగదు బహుమతి, ప్రసంసాపత్రాలు అందచేస్తామన్నారు. జిల్లా స్థాయి నుంచి యువత రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్లూమూన్ విద్యాసంస్థల ఛైర్మన్ శివశంకర్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గుడ్‌మార్నింగ్ పేరుతో స్థలాలు కబ్జా

కేతిరెడ్డిపై మంత్రి సత్యకుమార్ ధ్వజం

ధర్మవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఉదయం ఐదు గంటలకే ప్రజలు నిద్రలో ఉన్నప్పుడు గుడ్ మార్నింగ్ పేరుతో వెళ్లి ఖాళీ స్థలాలను గుర్తించి.. వాటిని స్వాహా చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక దిమ్మెల్ సెంటర్‌లోని ప్రధాన కాలువలో పూడిక తీసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. కేతిరెడ్డి గుడ్ మార్నింగ్‌కు బదులు గుడ్ ఈవినింగ్ కార్యక్రమం చేసి ఉంటే రోడ్లపై ఉన్న ప్రజలు వివిధ సమస్యలపై ప్రశ్నించేవారన్నారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, మున్సిపల్‌సిబ్బంది, రాజకీయనాయకులే కాక ప్రజలు, విద్యార్థులు ఇందులో భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

● కార్తీక దీపం స్థూపం ఆవిష్కరణ

స్థానిక చెలిమి ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక దీపం స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇందులో మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు పల్లెం వేణు గోపాల్, గడ్డం పార్థసారధి, అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు డీఎం సుందరేషన్ పాల్గొన్నారు.



కార్తీక దీపం స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

● తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.74.80 లక్షలతో అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి మంత్రి మంత్రి సత్యకుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, తహసిల్దార్ స్వర్ణలత, ఎంఈఓ చాముండేశ్వరి పాల్గొన్నారు.

ఏలుకుంట్లలో టీడీపీ సభ్యత్వ నమోదు

ధర్మవరంరూరల్: మండలంలోని ఏలుకుంట్లలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరువీధుల సుధాకర్, కేశవనాయుడు, ఏగి నాటి వెంకటరమణ, మోపూరి రామ్మోహన్, గుత్తాసూరి, మలసాని భాస్కర్‌చౌదరి, తిరువీధుల రామకృష్ణ, పురుషోత్తం, అమరా కేశవ, పుల్లప్ప, చాంద్‌బాషా పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

సంక్షిప్తం

రోడ్డు సౌకర్యం కల్పించాలని వృద్ధుల ధర్నా


రోడ్డు సౌకర్యం కోసం ధర్నా చేస్తున్న వృద్ధులు

మడకశిరటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఛత్రం తులసీధామ వృద్ధాశ్రమానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వృద్ధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి వృద్ధాశ్రమానికి ఉన్న రహదారి తమదేనంటూ లోపలికి వెళ్లేందుకు ఆస్కారం లేకుండా గుంత తవ్వారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మద్దతు తెలిపారు. వృద్ధాశ్రమానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఇలాంటి విషయాల్లో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు ఎం.ఆర్.హనుమంతు, ఉగ్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సర్వసభ్య సమావేశం

మడకశిరటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని అన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య నాయకులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బారికేడ్ల వితరణ

పెనుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ దృష్టిలో ఉంచుకుని పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు పది బారికేడ్లను క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ యాజమాన్యం అందజేసింది. సోమవారం స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేశ్వర్లును కలిసి రీజనల్ మేనేజర్ గౌస్ పీర్ వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ చంద్రశేఖర్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

గోరంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి, పెండింగ్‌లో కేసులు, శాంతిభద్రతలు, రాజకీయ స్థితిగతులపై సీఐ శేఖర్‌తో చర్చించారు.

పేర్లు నమోదు చేసుకోండి

పెనుకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 1న ధర్మవరంలో నిర్వహించే కవితోత్సవంలో పాల్గొనేందుకు పేర్లను నమోదు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా కోరారు. చేనేత కష్టాలు, వృద్ధాప్యం అంశాలపై 20 లైన్‌లకు మించని కవితల ను పాటలను వినిపించవచ్చని తెలిపారు. వివరాలకు 9440929894, 9494018465 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

మడకశిరటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు, క్రమ శిక్షణగా ఉండేందుకు ఎన్‌సీసీ ఎంతో దోహదం చేస్తుందని శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాల చైర్మన్ రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు వాల్మీకి సర్కిల్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరు అని, సేవాభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాంతరాజు, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు చిరంజీవి తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● ఆలనాపాలన లేక శిథిలావస్థలోకి.. ● పట్టించుకోని అధికారులు ● ప్రభుత్వ ధనం మట్టిపాలు



కొడికొండ చెక్‌పోస్టులో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం, నిరుపయోగంగా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

చిలమత్తూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటికి ఆలనా పాలన కరువవడంతో పక్కాగా ఉన్న భవనాలు మట్టిపాలవుతున్నాయి. చిలమత్తూరు మండలంలో ఇలాంటి భవనాలు పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మండలంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు మూతపడటంతో ఆ భవనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొడికొండ చెక్‌పోస్టులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బలిజపల్లి, నంజిరెడ్డిపల్లి, సుబ్బరావుపేట, ముద్దపల్లి, వై.గొళ్లపల్లి, మాదిరెడ్డిపల్లి గ్రామాల పాఠశాలలు మూతపడటంతో ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అదేవిధంగా కోడూరులో పాత పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన పెద్ద భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కొడికొండ చెక్‌పోస్టులో గతంలో వాణిజ్య పన్నుల కార్యాలయంగా పనిచేసిన కొత్త భవనం ఇప్పుడు పర్యవేక్షణకు కరువైంది. దాంతో ఇప్పటికే భవనానికి ఉన్న కిటికీలు, వాకిళ్లను ఎత్తుకెళ్లారు. ఆ పక్కనే ఉన్న కోట్ల రూపాలయ విలువ చేసే ఏపీ టూరిజం శాఖకు చెందిన రెస్టారెంట్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం టెండర్లకు అవకాశం ఇవ్వకపోవడంతో దానిని పట్టించుకునేవారే కరువయ్యారు. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖకు సంబంధించిన క్వార్టర్స్‌లో ఒకప్పుడు ఎంతో అందంగా, ఉద్యోగులకు సౌకర్యంగా ఉండే భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉద్యోగులు నివాసం లేకపోవడంతో లక్షల వ్యయం చేసి నిర్మించిన భవనాలు మట్టిపాలవుతున్నాయి. అదేదారిలో పోలీస్ క్వార్టర్స్ భవనాలు కూడా శిథిలమయ్యాయి. ప్రజలకు సేవల కోసం నిర్మించిన భవనాలు కళ్లెదురుగానే పాడవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోలేదు. ఆ భవనాలను అలాగే వదిలేయకుండా ఇతర ప్రత్యామ్నాయ అవసరాలకు ఉపయోగిస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ




ఉమానర్మదేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివలింగాలు, బసవనపల్లి శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, మడకశిరలో చంద్రమౌళేశ్వర స్వామికి గ్రామోత్సవం

హిందూపురం అర్బన్/మడకశిరటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచే మూల విరాట్‌లకు వివిధ అభిషేకాలు, అర్చనలు చేసి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బసవనపల్లి శివాలయంలో 40 అడుగుల శివుని భారీ విగ్రహం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై లక్షదీపోత్సవాల్లో పాల్గొన్నారు. మూలవిరాట్‌ను సుందరంగా ముస్తాబు చేశారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. త్యాగరాజనగర్‌లోని ఉమానర్మదేశ్వరస్వామి ఆలయంలో లక్షదీపోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. మడకశిరలోని చంద్రమౌళేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రమౌళేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. షిరిడీ సాయినాథుడి ఆలయంలో విశేష పూజలు, ఆంజనేయస్వామికి ఆకు పూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే


ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అమరాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. అమరాపురం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికేనని పేర్కొన్నారు. వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. పింఛను మంజూరు చేయాలని, కొత్త ఇళ్లు మంజూరు చేయాలని, ఇళ్ల బిల్లులు అందించాలని, తాగునీరు, సాగునీరు, వన్‌బీ అడంగల్, ఈపాస్ పుస్తకం తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా అందించినట్లు తహసీల్దార్ మారుతీప్రకాష్ తెలిపారు. ప్రజలు అందించిన సమస్యలను పరిశీలించి దశల వారిగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, గణేష్, జయకుమార్, నరసింహమూర్తి, శివరుద్రప్ప, నాగరాజు, అన్ని శాఖల అధికారులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎస్ఐ మునిప్రతాప్

గుడిబండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని వేణుగోపాలస్వామిజీ, కెనరాబ్యాంకు మేనేజర్ మల్లయ్య, ఎస్ఐ మునిప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం గుడిబండలోని రవీంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ నూతన భవన నిర్మాణ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవీంద్ర ఇంగ్లీషు మీడియం పాఠశాల యాజమాన్యం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతిలో మంచి మార్కులతో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధిస్తున్నారని అన్నారు. నూతనంగా నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీంద్ర, సిద్దయ్య, రాజు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం


ఆనంద్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ గా ఎంపికైన బేవనహళ్లి ఆనంద్‌కుమార్‌ను ఎమ్మెల్యే నివాసంలో మడకశిరకు చెందిన ఉపాధ్యాయులు సోమవారం సన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, అరుణాచల్‌రెడ్డితో పాటు ఉమాశంకర్‌రెడ్డి, బాలాజీ, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

మడకశిర రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భక్తరహళ్లి నరసంహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. డిసెంబర్ 13 నుంచి 19వరకు స్వామి వారి బ్రహోత్సవాలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రం భక్తరహళ్లి నరసంహస్వామి ఆలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాల కలగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, దేవదాయశాఖ ఈఓ నరసంహరాజు, నాయకులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ, సర్పంచ్ రామాంజనేయులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

లేపాక్షి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చిల్లర దుకాణం దగ్ధమైన సంఘటన సోమవారం బిసలమానేపల్లిలో చోటుచేసుకుంది. కురుబ రామాంజినప్ప దుకాణం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం కార్తీక మాసం సందర్భంగా కుటుంబ సభ్యులు ఆలయానికి వెళ్లగా సాయంత్రం 7 గంటల సమయంలో విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దుకాణంలో ఒక్కడే ఉన్న రామాంజినప్ప పరుగున బయటకొచ్చేశాడు. గ్రామస్థులు స్పందించి వెంటనే నీటితో మంటలను ఆర్పేశారు. అప్పటికే ఇంట్లోని ఫ్రిడ్జ్, బీరువా, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. దాదాపు రూ.5లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులుచేసి స్వాధీనం చేసుకున్నారు. పరిగి మండలం వన్నంపల్లికి చెందిన నారాయణప్ప, కల్లూరుకు చెందిన అశోక్, మూర్తి, నక్లపల్లికి చెందిన శీనప్ప కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొస్తున్నారు. అందిన సమాచారంతో దాడులు చేసి మూడు కేసుల మద్యం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు.

భూనిర్వాసితులకు పునరావాసం కల్పించండి

పుట్టపర్తిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం కోనసముద్రం వద్ద నాసన్, బెల్, ఎయిర్‌బస్ కంపెనీల ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట భూనిర్వాసితులు, నివాసా లు కోల్పోయిన బాధితులతో కలసి సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. పాలసముద్రం గ్రామాన్ని వచ్చే నెల 7న సందర్శించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యుత్ ఉప కేంద్రానికి మంత్రి భూమిపూజ


విద్యుత్ ఉప కేంద్రానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పరిగి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైడేటి గ్రామ సమీపంలో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సోమవారం భూమిపూజ చేశారు. పైడేటి గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండటంతో స్థానిక రైతుల ఫిర్యాదుల మేరకు మంత్రి విద్యుత్ ఉప కేంద్రానికి భూమిపూజ చేశారు. అనంతరం పరిగి మండల కేంద్రంలోని బీరలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీ జ్యోత్స్న, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓ లక్ష్మీదేవి, ఏడబ్ల్యూఓ విజయభారతి, వైద్యాధికారి స్వరూపరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

సోమందేపల్లి/పెనుకొండ టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండలంలోని వెలగమాకులపల్లి వద్ద అక్కమ్మగార్లు కొలువైన వేలుపుకొండలో నిర్వహిస్తున్న క్వారీ అనుమతులను రద్దు చేయాలని నాగినాయనిచెరువు, వెలగమాకులపల్లి, గుడిపల్లి, నల్లగొండ్రాయనపల్లి, బాపిరెడ్డిపల్లి రైతులు, గ్రామస్థులు సోమవారం మంత్రి సవితకు వినతి పత్రం అందించారు. 44వ జాతీయరహదారికి ఆనుకుని ఉన్న వేలుపుకొండలో బ్లాస్టింగ్‌లు చేయడానికి నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తమ ప్రాంతంలో గంజాయి విక్రయాలు విరివిగా జరుగుతున్నాయని, మత్తుకు బానిసైన యువకులు, ఆకతాయిలు వీధుల్లో సంచరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సాయినగర్‌కు చెందిన స్థానికులు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిచంద్రయాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మురళీమోహన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

శవం కలకలం

సోమందేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ఓ శ్మశానవాటికలో పురుషుడి శవం కలకలం రేపుతోంది. సోమవారం స్థానికులు కొంతమంది తలలేని పురుషుడి శవాన్ని కనుగొన్నారు. సమాధుల మధ్య పడి ఉండటాన్ని గమనించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. క్షణాల్లో వార్త దావానంలా వ్యాపించింది. అప్పటికే శవం పూర్తీ స్థాయిలో శిథిలమైపోయి ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా చంపిపడేశారా లేక అనాథ శవాన్ని పూడ్చకుండా వదిలేశారా, ఖననం చేసిన శవాన్ని జంతువులు తవ్వి బయటకు తీశాయా అనే చర్చలు సాగుతున్నాయి. ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా.. మూడు రోజుల క్రితం సమాచారం అందిందన్నారు. తాము శ్మశానవాటికలో వెళ్లి పరిశీలించామన్నారు. జీర్ణమైపోయిన శరీరభాగాలు శ్మశానంలో లభ్యం కావడం సహజమేనన్నారు. దీనిపై కొంతమంది పుకార్లు సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారన్నారు. ఏదైనా సంఘటన జరిగి ఉంటే తమకు ఫిర్యాదు అందేదన్నారు.

హింసలేని సమాజమే లక్ష్యం

అగళి/గోరంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హింస లేని సమాజాన్ని తీసుకురావడమే ఆర్డీటీ లక్ష్యం అని ఆ సంస్థ ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో సోమవారం 'మహిళలపై హింస నిర్మూలనా దినం' సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టసుఖాల్లో భార్య భర్తలు సమానంగా స్వీకరించి విజయాన్ని సాధించాలని తెలిపారు. భార్య భర్తల ప్రవర్తన పిల్లలపై పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఓబులేసు, ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు తదితరులు పాల్గొన్నారు. గోరంట్లలోని ఆర్డీటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ గంగరత్నమ్మ, ఎంఈఓ క్రిష్ణానాయక్, ఏటీఎల్ బాషా, ఎస్‌టీఎల్ రాంప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ సీతమ్మ, సీఓలు గంగాధర్ పాల్గొన్నారు.

దళితుల్లో చైతన్యమే ధ్యేయం

మడకశిరటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దళితుల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా చైతన్య యాత్ర చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 26 నుంచి డిసెంబరు 6 వరకు దళిత చైతన్యయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు, నాయకులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, అంజప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గోరంట్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరం నిర్వహిస్తుండగా సోమవారం దాడి చేసి 15 మంది జూదరులను పట్టుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. జూదం నిర్వహిస్తున్న సమాచారంపై దాడిచేసి వారి నుంచి రూ.1,29,160 నగదును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.